

# అమెరికా అమ్మాయి

## - శ్రీనిధి యెల్లల



**ఉద్యోగాలకోసం కొందరు**, చదువుల కోసం కొందరు, ఇలా వారి వారి కలల వెంటపడి చేరుకునే గమ్యం ఒకటి ఉంది ....అదే అమెరికా!

చిన్నతనంలో ఎంతో అబ్బురంగా, స్వర్గానికి మరోపేరుగా తలచిన దేశం. అక్కడి విశేషాలు, వస్తువులు, అక్కడినుంచి వచ్చిన మనుషులూ, అందరూ ఎంతో గొప్పవారనీ దేశంలో ఎంతటి పేరున్న గుడి వారైనా పూర్ణ కుంభంతో స్వాగతం పలికేటంత వి.వి .ఐ పీలు అనీ అనుకునే రోజుల నుండీ ... "ఆ వదినా మా పిల్లకి ఆవకాయ్ పట్టడానికి సాయానికి అమెరికా వెళ్తున్నాను దార్లో మీ అబ్బాయికి ఏమైనా ఇవ్వాలంటే ఇవ్వు, ఇచ్చేసి వస్తాను" అనే రోజుల్లోకి వచ్చేసాము .

దూరం కొద్దీ విలువని అంచనా వేసే మనం, ఆ దూరం తగ్గిపోయేసరికీ విలువనీ తగ్గించేస్తున్నామేమో?

ప్రపంచంలో అందరూ రెండే రెండు రకాల వారి గురించి చర్చిస్తూ ఉంటారు. ఒకళ్ళు ఉత్తములు అయితే మరొకళ్ళు అధములు. వీళ్ళు కాకుండా మరొక రకం ఉంది అదే మధ్యముల్ అన్నమాట. పై చెప్పిన రెండు రకాల వారి గురించి చర్చిస్తూ ఉంటారు . వీళ్ళ గురించి ఎవరూ పెద్దగా పట్టించుకోరు. కానీ వారు మాత్రం అందరి సమస్యలు నెత్తిన వేస్కుని భూభారాన్ని మోసేస్తూ ఉంటారు. ఆ కేటగిరీలో ఫస్టు ఉండేవాళ్ళలో నేనొకదాన్ని. ఉద్యోగం వదిలేసి భర్త వెంట అమెరికా వాసం వచ్చిన కాండిడేట్ ని. వీసా సమస్యల వల్ల ఇంట్లో చిక్కుకుపోయి , రోజూ న్యూస్ లో వచ్చే అమెరికా వార్తలు విని నాకెప్పుడూ ఉద్యోగం వస్తుందో అని లెక్కలు వేసే చుట్టాలని మేనేజ్ చేస్తూ, ఒంటి చేత్తో ఇంటినీ, పిల్లల్ని మేనేజ్ చేస్తూ, ఉద్యోగాలకి వెళ్లే ఆడవారి వైపు ఆరాధనగా, హడావిడిగా కాలేజులకీ పార్టీలకి వెళ్లే పిల్లల వైపు ఈర్ష్యగా, ఇప్పుడే కొత్తగా వచ్చిన వారిని తేలిగ్గా చూస్తూ, గడుసుగా ఈ అమెరికా వాసాన్ని ఈదుతూన్న ఒక సగటు తెలుగు పిల్లని.

మబ్బుల చాటు తొలగిపోతున్న కొద్దీ, కాస్తకాస్తగా బయటపడుతున్న అందమైన దేశాన్ని విమానపు కిటికీలోంచి ఆనందాతిశయంతో చూసిన మొదటి క్షణాలు ఎన్నటికీ మరచిపోలేను. చదివిన చదువూ, చేసిన ఉద్యోగం దేనివల్లనైతేనేం సిగ్గు, బిడియాలు అనే ఆభరణాలు పాతవైపోయి పర్యుత్సుకత, ఉత్సాహం అనే అలంకారాలు మాత్రమే ధరించిన ఈకాలపు అమ్మాయిని. ఎయిర్ పోర్ట్ నుండి బయట పడి అమెరికా గడ్డపై నిలబడ్డప్పుడు మొట్ట మొదటగా గమనించిన మార్పు, మనుషుల కరువు. ఒక్క నిమిషం ఉక్కిరిబిక్కిరి చేసిన ఒంటరితనం. చిన్న కలవరపాటు. రివ్వున వీస్తున్న చల్లటి గాలికి కళ్ళలో ఊరిన తడికి అస్పష్టంగా అల్లుకుని పోయినట్టు ఉన్న బంగారు అక్షరాలు . తేరుకుని చూద్దును కదా, అరచేతిలో ఉన్న పాస్ పోర్టుపై "సత్యమేవ జయతే" అన్న అక్షరాలు. నువ్వు నా బిడ్డవి, నీకు ఎదురే లేదు అని ఏదో శక్తి భుజంతట్టిన భావన. అలా పడింది అమెరికా నేలపైన నా మొదటి అడుగు. ఇక్కడి ప్రస్తుత జీవనం, ఇన్ని సుఖాల మధ్య ఉండే కష్టాలు, ఉక్కిరిబిక్కిరి చేసేంత పని లేదా పిచెక్కించేంత ఏకాంతం, చదువుకునేందుకు పాట్లు, ఉద్యోగపు వేటలు, తల్లితండ్రుల ఆశలు పిల్లల ఆశయాలు ఇలా ఎన్నో విశేషాలు. ఈ భావోద్వేగపు రంగులరాట్నంలో నాతో పాటు షికారుకు తయారు అవ్వండి మరి..

★★★

# గ్రూపు రాజకీయాలు

జీవితంలో ప్రతి ఒక్కరికీ కొన్ని దశలు ఉంటాయి కదా బాల్యం నుండి వృద్ధాప్యం వరకూ. అలాగే అమెరికా జీవనంలో కూడా ఎన్నెన్నో దశలు. డాలర్ని వందల స్థానం నుండి ఒకట్ల స్థానంలోకి తెచ్చి చూడగలిగేది ఒక దశ. మడత పరుపుల అపార్ట్మెంట్ నుండీ అన్ని హంగులూ ఉన్న సొంతిల్లు కలవారు అవడం ఒక దశ. స్టూడెంటుగా వచ్చి సిటిజెన్ గా మారడం ఒక దశ. పెళ్లి చేసుకుని డిపెండెంటుగా వచ్చి ఇండిపెండెన్సు కోసం వేచిచూడడం ఒక దశ. ఇవేవి అంత సులువుగా అయిపోయే పనులు కాదు. ఆ ఎదురుచూపుల్లో ఎంతో కాలం, వయసు, ఓర్పు ఖర్చయిపోతాయి. ఇలా లింగ భేదాలు లేకుండా ప్రతి ఒక్కరూ ఏదో ఒక దశలో పడి అమెరికా భవసాగరాన్ని ఈదుతూ ఉండవలసిందే.

మేము అమెరికాలో మొదటగా లాస్ ఏంజెలెస్ లోని ఒక మారుమూల చిన్ని ఊరిలో ఉండేవాళ్ళం. నా మటుకు ఇక్కడ అన్నిటికన్నా కష్టమైన పని ఏదైనా ఉందా అనడిగితే, అది 'కాలాన్ని ఎలా వెళ్ళదియ్యాలి' అనే అంటాను. ఆఫీసులు, వ్యాపారాలు ఉన్నవాళ్లు అసలు సమయమే సరిపోవడం లేదు అనుకుంటారు. వీసా కోరల్లో చిక్కడిపోయి ఇంట్లోనే ఉండిపోయే వారేమో కాలాన్ని ఎలా సాగదియ్యాలో అని అవస్థపడిపోతుంటారు. ఉన్నపాటుగా వచ్చిన విరామాన్ని ఏమి చెయ్యాలో తెలిక మొదట్లో ఈయన మెదడు తినేసేదాన్ని. సినిమాలు, షాపింగులూ, వంట పనీ, తోట పనీ అన్నీ మొహం మొత్తేసాయి. అలా అమెరికా వచ్చిన కొత్తల్లో కాలాన్ని ఎలా ఉపగించుకోవాలనే విషయం మీద తీవ్రంగా ఆలోచిస్తు వాకింగ్ చేస్తున్న నాకు నవ్వుతూ ఎదురైంది ఒక నేస్తం. నా కష్టం చెప్పుకోగానే నాలాగా ఎంతో మంది ఉన్నారనీ, వారంతా ఒక గ్రూపుగా ఏర్పడి సమయాన్ని చేకోడీలు తిన్నంత వీజీగా తినేసి, అది కూడా సరిపోక పక్క వాళ్ళ సమయాన్ని కూడా నమిలి మింగేస్తారని చెప్పింది. 'మరి జాయిన్ అవుతారా మా గ్రూపులో?' అనగానే, ఎగిరి గంతేసి ఒక దూకు దూకేసి వాళ్ళల్లో కలిసిపోయా.

అప్పటినుండి మొదలు, అసలు పేజ్ 3 సెలెబ్రిటీల కన్నా ఎక్కువ హడావిడి మొదలైంది. ప్రతి రోజూ ఎవరో ఒకరి ఇంట్లో కలవడం, పరిచయాలు పెంచుకోవడం. వీసా కష్టాల నుండి పిల్లల పెంపకం వరకు అన్ని సమస్యలకి సమాధానాలు ఉండేవి. అలా నెల గడిచేసరికి గ్రూపులోని అందరూ వాట్స్ ఆప్ కీ, అక్కడి నుండి ఫేస్ బుక్కుకి, అక్కడి నుండి ఇన్స్టాగ్రామ్ కి పాకిపోయారు. ఇంట్లో కూడా ఈయనకి నా గొడవ తప్పిపోయింది.

అలాగే జరిగితే ఇంక గొడవేముంది అసలు. పోనుపోనూ మన వాళ్ళ సంఖ్య పెరుగుతూ రావడంతో రాజకీయాలు కూడా పెరగసాగాయి. జాతీయ పార్టీలా సమైక్యంగా ఉండే గ్రూప్ ఎవరి భాషని బట్టీ ప్రాంతీయ పార్టీలుగా విడిపోయింది. మరి మన తెలుగు వారేమో ఆంధ్రా, తెలంగాణా లెక్కన విడిపోయారు.

ఇంతకు ముందు పరిచయాల వల్ల అన్ని గ్రూపులతోని కలుపుగోలుగా ఉండడానికి ప్రయత్నించాను. అదెంత బుద్ధితక్కువ పనో రానురాను తెలిసొచ్చింది. ఒకటికి నాలుగు గ్రూపులయ్యేసరికి పోటీ వాతావరణం మొదలయ్యింది. ఉత్తరాది వారు ఊరికెనే ఉండరు కదా, వారానికో థీమ్ అని చెప్పి 'అందరు ఒకే లాంటి బట్టలు వేసుకోవాలి' అనే కాన్సెప్ట్ తెచ్చారు. ఒక వారం 'మియామీ థీమ్' అంటే ఒక వారం 'వేగాస్ థీమ్' లాగా అనమాట. ఇక పండగలు పబ్బాలు వస్తే వీళ్ళ హడావిడికి అంతు ఉండదు. మియామి థీమ్ అని ఆదివాసీల్లాగా తయారయ్యిన వారు మరుసటి వారమే 'కర్వా చౌత్' అని తలనిండా ముసుగులేసుకుని పెట్టెల్లో భద్రంగా దాచిన నల్లపూసలు దిగేసుకొని ఫోటోలు దిగేవారు. ఇవన్నీ ఫేస్ బుక్ నుండి ఇన్స్టా గ్రామ్ దాకా మోత మోగించేసేవి.

ఇదంతా భరించినా, వారానికి ఒక డ్రెస్సు, దానికి తగ్గ పూసల దండలు అంటే సగటు సౌత్ ఇండియన్ అయిన నాకు గుండె గుభేలుమనేది. నెలకి ఆ గుడ్డ ముక్కలకి తగలేసే వాటితో శ్రావణ శుక్రవారానికి ఒక నాలుగు కాసులు కొనుక్కోవచ్చు కదా అనిపించేది. పైగా అవి మరి ఇంకెక్కడా వేసుకోడానికి వీల్లేని థీమ్ డ్రెస్సులు. పాపం మొదటి రెండుసార్లు సరదాగా కొనిపెట్టారు గానీ మూడోసారి నుండి తప్పించుకు తిరగడం మొదలెట్టారు ఈయన. దీనికి తోడు రసమలై నుండి ఖఢీ వరకూ, కోఫ్తా నుండీ కచోరి వరకూ ప్రతి పాట్ లాక్ లో నోరూరించే నార్త్ ఇండియన్ వంటలు పుష్కలంగా వెన్న, నెయ్యితో చేసుకొచ్చి పెట్టేవారు. నా వాటాకి వచ్చిన వాటిని వాహ్ చెఫ్ నో, సంజీవ్ కపూర్ నో ఫాలో అయ్యి చచ్చి చెడి తీసుకెళ్ళేదాన్ని. ఈ దెబ్బతో మునక్కాడలా ఉండేదాన్ని నూనొంకాయ్ లాగా తయారయ్యాను. అలా ఓ రెండు నెలల తర్వాత ఈ స్టార్ ప్లస్ షో లో ఇమడలేక జాతీయ భావాలకి, సమైక్య భావాలకి నీళ్ళొదిలేసి ఈ గ్రూప్ నుండి సెలవు తీసుకున్నాను.

ఇహ మన తెలుగు గ్రూపులకి పరిమితం అవుదామనుకుంటే ఇక్కడా మొదలయ్యాయి రాజకీయాలు. పట్టుమని ఒక నెల సరిగ్గా ఉంటారో లేదో, ఎవరో ఒకరికి ఇంకొకరి మీద ఈర్ష్య, అందులోనుండి ఫిర్యాదులు. వీరిద్దరూ విడిపోయి, ఉన్న గ్రూపుని ఇంకో రెండింటి కింద మార్చడాలు. ఇవి చాలక వారానికోసారి పాట్ లక్ లని చేసేవారు. ఒక కొత్త పద్దతిని మితంగా అప్పుడప్పుడూ చేస్తే బాగుంటుంది. ఊహూ! ...ఆలా చేస్తే బాగుపడిపోతాం కదా! ఏదైనా సరే దాని అంతు చూసి, మనుషులకి వెర్రి ఎక్కించేసి, వెగటు పుట్టేలా చేయడమే మన ధ్యేయం. ఈ 'పాట్ లక్' లనేవి ఏవైతే ఉన్నాయో వాటిని కనిపెట్టిన వాడిని అర్జంటుగా కనుక్కుని పాట్ లక్ కి పిలిచి, ప్రపంచంలో అత్యంత కష్టమైన వంటకం చేసుకురమ్మని చెప్పాలి. ఏదో నా వాటా కింద వచ్చిందని సరదా పడి ఈయన సాయం తీసుకుని బిర్యానీ చేసుకుని వెళ్ళాను, అంతే ఇక పాట్ లక్ అన్న ప్రతి సారీ, 'మీరు చేసినట్టు బిర్యానీ ఎవరూ చెయ్యరండి, మీ బిర్యానీకి మేమంతా ఫాన్స్ అండి ' అని మొహమాట పెట్టేసి ప్రతి సారీ ఆ బంపర్ ఆఫర్ నాకే ఇస్తారు. చేసి చేసి ఆ మసాలా

వాసనలకి మొహం మొత్తేసి ఇక జీవితంలో బిర్యానీ తినకూడదు అని డిసైడ్ అయిపోయా. అసలు నన్నడిగితే ఈ బిర్యానీ ఎంత కామన్ ఐపోయిందంటే, అది లేక పోతే ఇక ఫంక్షన్లలో, పార్టీలలో వడ్డించినట్టే కాదు అనుకునేటంత. నవాబుల కాలంలో యుద్ధంలో సైనికులకి అన్నేసి కూరలు వండలేక, పౌష్టికంగా ఉంటుందని అన్నీ కలేసి వండేవారుట. మరి మేమేమి యుద్ధాలు చేస్తున్నామని ఓ కలబడి వారం వారం 'బిర్యానీ' 'బీర్యాని' అని కలవరించడానికి. కాస్త మొహమాట పడ్డామే అనుకో ఇహ అంతే సంగతులు. అసలు మా అత్తగారి వైపు వాళ్ళకి కూడా ఇన్నేసి సంతర్పణలు చెయ్యలేదు నేను. కొందరు ఉంటారు ప్రతి పాట్ లక్ కి 'రైతా' చేసుకుని వస్తాం, 'సలాడ్ పట్టుకుని వస్తాం' అంటారు. వీళ్ళ తెలివికి మెచ్చుకోవాలి.

ఈ పాట్ లక్ పాట్లు ఎన్నని చెప్పేది. అన్నిటికి పోటీనే. కొనుకున్న బట్టలూ, నగలు ఇంకొకరికి చూపెట్టాలంటే పాట్ లక్, కొత్తగా ఇంట్లోకి ఏదైనా వస్తువు కొంటే పాట్ లక్. ఇదైన వెంటనే అంతకు మించిన వస్తువు ఇంకొకళ్ళు కొని వారింట్లో ఒక పాట్ లక్. ఒకళ్ళు పదేసి ఐటమ్స్ తో పాట్ లక్ చేస్తే, మరొకరు అంతకు రెండాకులు ఎక్కువ ఐటమ్స్ తో పాట్ లక్. ఆ భారం మళ్ళీ అందరి మీదే. అసలు ఏ కార్యక్రమం అయినా అటు తిరిగి ఇటు తిరిగి 'షో ఆఫ్' కి మాత్రమే పనికి వచ్చేలా చెయ్యడంలో మనకి మనమే సాటి. ఈ శ్రమ దోపిడీ ఒక ఎత్తు అయితే, 'వ్యక్తిగత సమయ దోపిడీ ' ఇంకో ఎత్తు. ఏమి చేసినా, ఎక్కడికి వెళ్లినా అందరికి చెప్పే వెళ్ళాలి. లేకపోతే హర్ట్ అయిపోతారు. ఇష్టపడి చెవి కమ్మలో, కూపన్లతో ఏదైనా బ్లెండరో కొనుక్కుంటే ఇహ అంతే. మాకు చెప్తే మేము కూడా కొనుక్కునేవాళ్ళం కదా అని అలకలు. అరె! ఎవరి ఇష్టాలని బట్టి వారు కొనడం మానేసి, వాళ్ళకి ఉంటే మనకీ ఉండాల్సిందే అనే పంతం ఉంటే ఎలా! రానురాను ప్రతి చిన్న విషయమూ చెప్పి, చర్చించి చెయ్యాల్సిన పరిస్థితి.

ఈ గ్రూప్ ఆక్టివిటీస్ ఏమో గానీ, తెలీకుండానే వారాలూ, వారాంతాలు హాం ఫట్ స్వాహా అయిపోయాయి. చివరికి పుట్టినరోజు రాత్రి అలసి సొలసి వెచ్చగా తనని పట్టుకుని బజ్జుకుని ఉంటే, సరిగ్గా పన్నెండు కల్లా గణ గణ మని వచ్చేసారు. 'సర్ప్రైస్ బర్త్ డే కేక్' అని. ఇదేమన్నా ఇంకా కాలేజీ రోజులా? అప్పుడంటే ఫ్రెండ్స్ తోడిదే లోకం. ఇప్పుడు కూడా అలాగే ఉండాలంటే ఎలా? ఇంట్లో ఉండే మనుషులకి కూడా కాస్త సమయం ఇవ్వాలి కదా. ఇహ అంతటితో ఓపిక నశించింది. ఈ డిపెండెన్సీ దశలోని ఈ 'గ్రూపుల' దఫా మీద విసుగొచ్చేసింది. ఆ తర్వాత ఏడుపొచ్చింది. బాల్కనీ గార్డెన్ లో నీళ్లు పడుతూ వుంటే, కాఫీ తాగుతూ ఆఫీస్ కబుర్లు చెప్తున్న ఈయన్ని, మా గ్రూప్ వాళ్ళు ఒక తోపుతో అవతలకి నెట్టేసి నన్ను లాక్కెళ్లిపోతున్నట్టూ, ఈయన వెర్రిగా నాకోసం వెతుకుతూ పరిగెడుతున్నట్టూ ఒకటే పిచ్చి కలలు రావడం మొదలయ్యాయి. దీని కన్నా ఖాళీగా ఇంట్లో కూర్చుంటే కాస్త మనసైనా ప్రశాంతంగా ఉంటుంది అని నిర్ణయానికి వచ్చేసా. చెప్తున్నాగా ఏదైనా సరే అయితే 'అతివృష్టి' లేదా 'అనావృష్టి' ఈ దేశంలో.

అంతే మరిక ఏమాత్రం ఆలస్యం చేయకుండా ప్రాంతీయ గ్రూపులకి కూడా నా సేవలని రద్దు చేసి, ఇల్లే వైకుంఠం కదుపే కైలాసం అని తెలివి తెచ్చుకుని బుద్ధిగా ఉండిపోయా.

తరువాత 'లాస్ ఏంజెలెస్' వదిలేసి 'బే ఏరియా' రావడం జరిగింది. షరా మాములుగా అపార్ట్మెంట్ కామన్ గ్రూపులో మన ప్రమేయం లేకుండా చేర్చుకోబడడం జరిగింది. కాకపోతే మనకున్న కళలన్నీ ప్రదర్శనకి పెట్టకుండా, ప్రేక్షక పాత్ర మాత్రమే స్వీకరించి తామరాకుపై నీటిబొట్టులా ఉండే లౌక్యం నేర్చేసుకున్నాను. 'తళుకు బెళుకు స్నేహాలు' తట్టెడు లేకుండా, 'నిక్కమైన మంచి నీలాల' వంటి స్నేహాలు గుప్పెడు సంపాదించుకున్నాను.

అదిగో ఏదో గ్రూప్ మెసేజి వచ్చింది, 'కమ్యూనిటీ గెట్ టు గెదర్ కి ఎవరెవరు ఏమేమి తీసుకు వస్తారు?' అని.

స్క్రీన్ మీద 'టైపింగ్' అన్న అక్షరాలు మొదలై పోయాయి...

క్షణం కూడా ఆలస్యం చెయ్యకుండా అందరి కన్నా ముందు 'రైతా విత్ సలాడ్ ' అని కొట్టి సెండ్ చేసేసా. అనుభవం నేర్పిన పాఠాలు గుర్తుపెట్టుకోవాలి మరి.

*(వచ్చేనెలలో అమెరికా అమ్మాయి ఏం చెబుతుందో.. ఎదురుచూద్దాం..!!)*

Post your comments